
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 141 | ది.8-8-2024 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**చల్లపల్లి/అవనిగడ్డ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు వరదనీరు విడుదల చేసిన నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు సూచించారు.తీరగ్రామాల ప్రజలతో పాటు.రెవెన్యూ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్లకు లేదా రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.శ్రీకాకుళం వద్ద వరద పరిస్థితిని ఘంటసాల తహశీల్దార్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతాం

**● నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం ● సీఎం నారా చంద్రబాబు నాయుడు ● విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న సీఎం**




**విజయవాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** నెలలో ఒక రోజు అందరం చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికుల ప్రగతికి తోడ్పాటును అందిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడ మేరీస్ స్టెల్లా కళాశాలలో జరిగిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల మాల్ ను సందర్శించారు. కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. 'టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని వేళలా చేనేతలు అండగా నిలిచారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడం నా బాధ్యత. మా ప్రభుత్వం చేనేత కార్మికులకు పూర్తి అండగా ఉంటుంది. నాడు స్వాతంత్ర్యోద్యమంలో స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించడం ఒక ఉద్యమంలా జరిగింది. అది అంతిమంగా క్విట్ ఇండియా ఉద్యమానికి దారితీసింది. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, నాడు సీఎంగా ఉన్న నేను చేనేత అంతర్జాతీయదినోత్సవానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో చేనేత కార్మికులందరికీ ఒక భరోసా కల్పిండం కోసం నేను ఈ రోజు ఇక్కడికి వచ్చాను. గత ప్రభుత్వం నేతన్న నేస్తం అని చెప్పి నేత కార్మికుడికి రూ.24 వేలు ఇచ్చేసి దాంతోనే అంతా బాగుపడిపోతారని అనుకున్నారు. మీకు రావాల్సిన అన్ని రకాల పథకాలను రద్దు చేశారు. ఆప్కో ద్వారా చేసే చేనేత వస్త్రాల కొనుగోళు ఆపేశారు. నూలు, రంగులపై ఇచ్చే రాయితీలు తీసేశారు. అన్ని రకాల రుణాలు తీసేసి చేనేత కార్మికులు పొట్ట కొట్టారు. గత ప్రభుత్వం పోతూ పోతూ చేనేత రంగానికి, కార్మికులకు రూ.266 కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయింది." అని సీఎం విమర్శించారు.

**రుణ మాఫీ చేసి ఆదుకున్నాం..** చరిత్ర ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చేనేత కార్మికుల కోసం అవిశ్రాంత పోరాటం చేసింది. 2007లో చేనేతలకు రూ.372 కోట్ల రుణాలు మాఫీ చేయకుండా ఆనాటి ప్రభుత్వం మోసం చేస్తే పోరాడాం. మా తమ పోరాట ఫలితంగా 2009లో ముఖ్యమంత్రి రోశయ్య రూ.109 కోట్లు రుణాలు మాఫీ చేశారు. టీడీపీ అధికారం లోకి రాగానే చేనేతలకు రూ.110 కోట్లు రుణాలు మాఫీ చేసి చేనేతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. 2014లో చేనేతలకు రూ.250 కోట్లు బడ్జెట్ కేటాయించాం. 90,795 చేనేత కుటుంబాలకు వంద యూనిట్లు కరెంటు ఉచితంగా ఇచ్చాం. చేనేత కార్మికులకు చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిసీ 50 ఏళ్లకే పింఛన్లు ఇచ్చిన ఘనత కూడా టీడీపీదే. నూలు, రంగులపైన సబ్సిడీ 20 శాతం ఉంటే దాన్ని 40 శాతానికి పెంచాం. మగ్గాలపై 50 శాతం రాయితీ ఇచ్చి రూ.80 కోట్లు ఖర్చు చేశాం. 70 వేల మంది చేనేత కార్మికులకు మోటరైజ్డ్ జకార్డ్ లిఫ్టింగ్ సదుపాయం కల్పించామన్నారు. చేనేత పరిశ్రమ పట్ల, చేనేతల పట్ల మాకున్న శ్రద్ధకు ఇది నిదర్శనం చేనేతలకు ఇచ్చిన అన్ని హామీలు నిలబెట్టుకుంటాం" అని సీఎం స్పష్టం చేశారు.

**బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం..** రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. బీసీల్లో చాలా ఉప కులాలున్నాయని, వారంతా చాల వెనుకబడి ఉన్నారని, ఎక్కువ మంది కుల వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని వారందర్నీ ఆదుకుంటామన్నారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. తద్వారా బీసీ జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. స్థానిక సంస్థల్లో మళ్లీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామన్నారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని, ఇది పార్లమెంటులో చట్టమయ్యేంత వరకు బీసీల తరపున పోరాటం చేస్తామని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్ష, అసెంబ్లీ స్పీకర్ ఇద్దరూ బీసీలేనని గుర్తు చేశారు.

# భావి తరాలకు డొక్కా సీతమ్మ దాతృత్వం తెలియాలి..

**● మధ్యాహ్న భోజన పథకానికి అపర అన్నపూర్ణ పేరు సబబు ● ప్రభుత్వం నిర్వహించే కాంటీన్లను ఎన్టీఆర్ పేరుతో కొనసాగించాలి ● ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**అమరావతి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభించే కాంటీన్లకు పేరు ఖరారు విషయంలో ఒక ఆసక్తికర చర్చ చోటు చేసుకొంది. వీటికి ఎన్టీఆర్ పేరుతో అన్నా కాంటీన్లు అని కొనసాగించాలా, డొక్కా సీతమ్మ పేరు కూడా జోడించాలా అనే చర్చ వచ్చింది. ఈ సందర్భంగా 2019 వరకూ ఉన్న విధంగా అన్నా కాంటీన్లు అని, అలాగే కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిర్ణయించిన క్రమంలో కాంటీన్లకు ఎన్టీఆర్ పేరును కొనసాగించవచ్చని ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్లారు. డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తే ప్రతి విద్యార్థికి సీతమ్మ గారి గొప్పదనం తెలుస్తుందని, పాఠశాల స్థాయిలో విశిష్ట వ్యక్తులు, దాతృత్వం కలిగినవారి పేర్లు మీద పథకాలు ఉండటం వల్ల భావితరాలకు మేలు కలుగుతుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తాను పాఠశాల దశలో ఉండగా డొక్కా సీతమ్మ గారి గురించి చదివిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కంబాల కృష్ణమూర్తి రాసిన అమృత వాక్కులు అనే సంకలనాన్ని మా నాన్న ఇచ్చారు. అందులో డొక్కా సీతమ్మ దాన గుణాన్ని, ఆకలి అన్న వారికి అర్థరాత్రి వేళ కూడా వండివార్చి పెట్టేవారనీ, అంతర్వేది దర్శనానికి బయలుదేరితే, దారిలో తన ఇంటికి భోజనానికి యాత్రికులు వస్తున్నారని తెలిసి దైవ దర్శనానికి వెళ్లకుండా వెనక్కి వచ్చి ఆకలి తీర్చారని చదివాను. ఆ రోజు నుంచి డొక్కా సీతమ్మ గారి దాతృత్వ భావనలు గుర్తుకు వస్తూనే ఉంటాయని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. స్కూలు విద్యార్థులకు భోజనం అందించే పథకానికి డొక్కా సీతమ్మ పేరు ఉండటం వల్ల భావి తరాలకు విలువలు అందించగలమన్నారు. అలాగే పేదలకు కిలో రూ.2 కు బియ్యం అందించే పథకం తీసుకువచ్చిన ఎన్టీఆర్ పేరుతో అన్నా కాంటీన్లు నిర్వహణ సముచితమన్నారు.

# సిఎం దృష్టికి రియల్ ఎస్టేట్ రంగ సమస్యలు

**● సిసోడియాను కలిసిన నారెడ్కో ప్రతినిధి బృందం**



**అమరావతి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** రెవిన్యూ విభాగానికి సంబంధించి రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కుంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తెలిపారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డవలప్ మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో సిసోడియాను కలిసి రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించింది. నారెడ్కో బృందంలో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు, సెక్రటరీ జనరల్ సీతారామయ్య, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ, రాష్ట్ర కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్ పరుచూరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడె జగన్ తదితరులు ఉన్నారు. ఉన్నారు. ప్రధానంగా నెరెడ్కో ప్రతినిధులు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ పార్శిల్ మ్యాప్ విధానాన్ని రద్దు చేయాలని, నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్) పన్ను తగ్గించాలని కోరారు. ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం (జెడిఎ) కోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయింపుతో డెవలపర్‌లపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని, మరిన్ని జాయింట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను ప్రోత్సహించేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్ ల్యాండ్‌గా మార్చే సమయంలో పట్టణ ప్రాంతంలో స్క్వేర్ యార్డ్ రేట్ల ఆధారంగా మార్పిడి ఛార్జీలను విధిస్తోందని, దానికి బదులుగా ఎకరాలలో లెక్కించాలని నెరెడ్కో విన్నవించింది. విభిన్న సమస్యలను సానుకూలంగా పరిశీలించిన సిసోడియా అన్ని విషయాలను ముఖ్యమంత్రి దృష్టి తీసుకువెళతామని , ప్రభుత్వానికి అదాయం సమకూరేందుకు కూడా రియల్టర్లు సహకరించాలని కోరారు.

# అక్టోబర్ 1న నూతన మద్యం పాలసీ

**● మద్యం ఎంఎన్‌సీ ప్రతినిధులతో సమావేశంలో గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



**అమరావతి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ప్రజల ప్రాణాలు హరిస్తున్న కల్తీ మద్యం బ్రాండ్ల నుండి విముక్తి కలిగించేలా త్వరలోనే మెరుగైన పాలసీ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సచివాలయంలో మద్యం తయారీ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. 2014-19 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని కేవలం ప్రైవేటు వ్యాపారంగా మాత్రమే భావించింది. దేశం మొత్తం లభించే బ్రాండ్లను ఏపీలో కూడా అందుబాటులో ఉంచింది. కానీ, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత నాటి పాలకులు మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని ప్రజల ప్రాణాలు హరించారు. మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చే పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు. సంక్షేమ పథకాలకు, మద్యం అమ్మకాలకు ముడి వేసి ప్రజల ఆదాయాన్ని హరించారు. అమ్మకాలకు, కొనుగోళ్లకు సంబంధమే లేకుండా వేల కోట్లు దోచుకున్నారు. దేశమంతా డిజిటల్ పేమెంట్ల వైపు వెళ్తుంటే ఏపీలో మాత్రం క్యాష్ అండ్ క్యారీ విధానంలో మద్యం అమ్మకాలతో వేల కోట్ల లూటీ చేశారు. వినియోగదారుడు తనకు నచ్చిన బ్రాండ్ కాకుండా.. ధర చెప్పి కొనుగోలు చేసే దుస్థితి కల్పించారు.

# ఆలయ పునఃప్రారంభం ఎన్నో జన్మల పుణ్యఫలం:మంత్రి సుభాష్



**రామచంద్రాపురం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ద్రాక్షా రామం భీమేశ్వర స్వామి ఆలయాన్ని పున: ప్రారంభించడం ఎంతో అదృష్టంగా ఎన్నో జన్మల పుణ్య ఫలంగా భావిస్తున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి చేతుల మీదుగా నీళ్లతో మాత్రమే అభిషేకాలు పున: ప్రారంభించారు.ఈసందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులకు వేద పండితుల పూర్ణకుంభంతో స్వాగతం పనికి ఆలయము నందు మంత్రోచ్ఛరణల నడుమ పూజారి కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భం గా మంత్రివర్యులు మాట్లాడు తూ గత ఏప్రిల్ 24వ తేదీన ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ వారు శివలింగం పాడైన సందర్భంగా మహా సంప్రోక్షణ చేయాలని ఆదేశించి ఉన్నార న్నారు.సుమారు మూడు మాసాల ఏడు రోజులు అనం తరం ఆర్కియాలజీ విభాగం వారి ఆదేశాల ప్రకారం నీళ్లతో మాత్రమే దేవస్థానం వారు అభిషేకాలు నిర్వహిం చాలని ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని ఆమెరకు జీర్ణోద్ధరణ పనులను పూర్తి చేసి అనంతరం దేవాలయానికి మహా సంప్రోక్షణ హెూమం కార్య క్రమాలు నిర్వహించి మంత్రి చేతుల మీదుగా బుధవారం 11.05 నిమిషాలకు నీళ్లతో అభిషేకాలు పున: ప్రారంభిం చుకోవడం సంతోషదాయకమన్నారు. మాణిక్యాంబ వారి పూజారి కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు.ఇకనుంచి ఉదయం దేవస్థానం తరపున నీళ్లతో అభిషేకాలు నిర్వహించుకోవడం జరుగుతుం దన్నారు. ఆర్కియాలజీ విభాగం వారు ఆదేశాలకు భక్తులందరూ శిరసా వహించి సహకరించాలని ఆయన కోరారు. ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయాన్ని పున: ప్రారంభం తన చేతుల మీదులుగా నిర్వహించడం ఎంతో సంతోషదా యకమని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాతినిర్మాణంలో మహిళలు ముందుండాలి



**కాకినాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** జెఎన్టియుకె ప్రాంగణంలో బుధవారం బుధవారం ఉదయం అలూమ్ని ఆడిటోరియం నందు మొదటి సంవత్సరం బీటెక్ మరియు మెడికల్ విద్యార్థులకు "జాతి నిర్మాణంలో మహిళల యొక్క పాత్ర" అనే అంశంపై ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్జి. మురళీకృష్ణ ముఖ్యఅతిథిగాను, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారిణి సి. రామలక్ష్మి విచ్చేయగా గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ. కెవి. రమణ, ఇఓ & డబ్ల్యుజి డైరెక్టర్ ప్రొ. ఎం.స్వరూపారాణి, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్.మోహన్రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.యు. వి. రత్నకుమారిలు విచ్చేశారు. యుసిఇకె పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.కె.కృష్ణభాస్కర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా.ఎస్.సత్యవేణిలు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రొ. కెవిఎస్జి. మురళీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జెఎన్టియుకెలో విద్యనభ్యసించి ఎంతోమంది ఐఏఎస్, ఐపిఎస్ మరియు వివిధ రంగాలలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తును ఉన్నతంగా మలచుకోవాలన్నారు. జెఎన్టియుకె యుసిఇకె కళాశాలలో ప్రవేశం పొందడం ఎంతో అదృష్టమన్నారు. విశిష్ట అతిథి సి. రామలక్ష్మి మాట్లాడుతూ జీవితంలో తల్లిదండ్రుల యొక్క ప్రాముఖ్యత, విద్య, క్రీడల యొక్క ఆవశ్యకత, రాజకీయాలలో యువత నిర్వర్తించాల్సిన బాధ్యత, లింగ వివక్షత మరియు ఎన్నికలలో మహిళల యొక్క పాత్రపై విశదీకరించారు. భారతీయ ఆర్థికాభివృద్ధిలో మహిళల ద్వారా అందే జిడిపి సుమారు 18% ఉందని తెలిపారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇంద్రనూయి, నిర్మలా సీతారామన్, కాకినాడ వాస్తవ్యులైన దుర్గాబాయ్ దేశ్ ముఖ్, డొక్కా సీతమ్మ, అంజలీ దేవి మొదలగు మహిళల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. తల్లిలా కూడా చూసుకునే తండ్రి, తండ్రిలా కూడా కాపాడే తల్లులను గౌరవించాలన్నారు. భారతదేశంలో 3 శాతం ఉన్న మహిళా ఇంజనీర్లు ప్రస్తుతం 18 శాతానికి పెరిగారన్నారు. మిస్సైల్ ఉమెన్ ఆఫ్ ఇండియా థెస్సీ థామస్ సాధించిన సాంకేతిక అభివృద్ధిపై విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఎవరిపై వారికి స్వీయ నమ్మకం ఉండాలని, వెదురులాగా ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలని, మార్పు మనతో మొదలు కావాలని పిలుపునిచ్చారు. సమయపాలన పాటించాలని, నీరు మరియు ఆహారాన్ని వ్యర్థం చేయకూడదన్నారు. పట్టుదలతో ముందుకు సాగాలని, ఓటమికి భయపడకుండా లక్ష్యాన్ని చేరుకునేలా ప్రయత్నించాలని, ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుని నిత్య విద్యార్థికి కొత్త విషయాలపై పట్టు సాధిస్తూ ఆధునిక ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. అనంతరం ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్జి. మురళీకృష్ణ, రెక్టార్ ప్రొ. కెవి. రమణ మరియు అధికారులు సి. రామలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ. కెవి. రమణ, ఇన్ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి. రవీంద్రనాథ్, ఓఎస్ ప్రొ.డి. కోటేశ్వరరావు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, యుసిఇకె, ఐడియల్ కాలేజీ, కైట్ కళాశాల, రంగరాయ మెడికల్ కళాశాలలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు బానిసలు కాకండి.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి..

**● డాక్టర్ ఎన్ సుధాకర్ రెడ్డి**



**తిరుపతి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు కరకంబాడి రోడ్డు మార్గంలోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వుయ్ ఆర్ విత్ యు చారిటబుల్ ట్రస్ట్ మరియు కళాశాల జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో మాదకతవ్యాలు మరియు పొగాకు ద్రవ్యాలు ఉత్పత్తుల వినియోగం వాటి దుష్ఫలితాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ హెూమియోపతి క్లినిక్ డాక్టర్ మధు ఆజాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు . సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచమంతటా అనేక కుటుంబాలు ను చిన్న బిన్నం చేస్తున్న మత్తు పదార్థాల వినియోగం బారిన పడకుండా జాగ్రత్తగా విద్యార్థులు విద్య వారి భవిష్యత్తుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు .అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం ఆరోగ్యకరమైన దుష్పరిమాణాలు మరియు చట్టపరమైన శిక్షణలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు డాక్టర్ కే రోజా, డాక్టర్ పి గీత, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ టి చంద్రయ్య ,డాక్టర్ సుజన్ కుమార్ అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీ విషయాన్ని పరిశీలిస్తాం

**● ఏపీ ఎంపీ రాష్ట్ర నాయకులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హామీ**



**మచిలీపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లాలోని అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లల ప్రైవేటు స్కూలు ఫీజు రాయితీ విషయంపై పరిశీలన చేస్తానని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్,ఇతర నాయకులు జిల్లా కలెక్టర్ బాలాజీ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్టుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసినందుకు ప్రైవేట్ స్కూల్స్ లో ఫీజు రాయితీ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఏపీ ఎంపీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా తక్షణమే స్పందించిన కలెక్టర్ బాలాజీ జిల్లా విద్యాశాఖ అధికారులతో ఫోన్లో సంప్రదించి సాధ్యసాధ్యాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏపీ ఎంపీఏ నాయకులు కోకా వెంకట మహేష్, మోలుగు వంశీకృష్ణ, గూడపాటి నరేష్ తదితరులు కలెక్టర్ ను కలిశారు.

# ఉధృతంగా ఏనుగుగడ్డ వాగు

**● చిలుకూరు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు ● ముంపులో పత్తి, వరి, మొక్కజొన్న పొలాలు**



**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నదికి భారీగా వరద నీటిని విడుదల చేయడంతో పాటు ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని ఏనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చిలుకూరులో ఏనుగుగడ్డ వాగు ఉధృతికి చుట్టూ ఉన్న పత్తి, వరి, మొక్కజొన్న పొలాలు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. వాగు ఉధృతికి వరద నీరు కాచవరం - దాములూరు ప్రధాన రహదారి పైనుంచి ప్రవహిస్తోంది. ప్రస్తుతం రాకపోకలు కొనసాగుతున్నాయి. వరద ఉధృతి మరింత పెరిగితే రహదారి పూర్తిగా ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోతాయి. దాములూరు, చిలుకూరు గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే అవకాశాలు ఉన్నాయి. గురువారం ఉదయం వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని చిలుకూరు గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు అప్రమత్తమై రాకపోకల్లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాల్సిన అవసరం ఉంది.

**IN THE COURT OF THE HON'BLE XII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA**
**E.P.No. 1849 / 2019**
**IN**
**A.O.P. No. 04 / 2014**

Between :
**M/s. Shriram Transport Finance Co. Ltd.,**
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
**1. Kondala Rao Gorla**
**2. Gajakanti Vara Prasad** ...JDR's/Respondents

**NOTICE TO JDR /RESPONDENT**

**1. Kondala Rao Gorla,** S/o. G. Sambasiva Rao, D.No. 1-93, Kondapavuluru, Gannavaram, Krishna - 521345.
**2. Gajakanti Vara Prasad,** S/o. Asirvadam, H.No. 19-8-15/B, Old Raja Rajeswari Peta, C.P.I Office, Vijayawada - 520011.

Take notice that the above Execution Petition filed by the DHR / Claimant praying orders against JDR-1&2. The same is posted to **09-08-2024** for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon'ble Court)
**DASARI RAJASEKHAR, M.Sc., M.L.,**
Advocate,
D.No. 29-1-30A, Seshadrisastry St., Governorpet,
Vijayawada-2, Mobile No. 9440579897.

**వార్తాప్రభ - పంచాంగం**

**8-8-2024 గురువారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం. ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : చవితి 00.37 వరకు
నక్షత్రం : ఉత్తర 23.33 వరకు
వర్జ్యం : తె.4.38 లగా..
దుర్ముహూర్తం : 10.02 నుండి 10.53 వరకు
రాహుకాలం : 13.58 నుండి 15.34 వరకు
మంచి సమయం : లేదు
సూర్యోదయం : 5.46కి
సూర్యాస్తమయం : 6.31కి

పోతిన కుమార్
సెల్ : 6300148993
9014094388
విజయ మిల్క్ పార్లర్
కుమార్ మిల్క్
విన్నకోటవారి చౌక్, విజయవాడ-1
మా వద్ద విజయవారి పాలు, పాల పదార్థములు ఆర్డరుపై సప్లయి చేయబడును.
డోర్ డెలివరీ సౌకర్యము కూడా కలదు
VIJAYA



Satish : 8019483304 - Ranga : 9247284050
దివ్యసాయి ఎలక్ట్రికల్స్
DIVYASAI ELECTRICALS
WHOLESALE & RETAIL ELECTRICAL GOODS
Opp. Steel Palce, Samarangam Chowk, Main Road, Vijayawada - 520 001
VIHAN GM legrand FINECAB



## ఇబ్రహీంపట్నం సీఐగా ఏ చంద్రశేఖర్ బాధ్యత స్వీకరణ



**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఇబ్రహీంపట్నం సీఐ గా చంద్రశేఖర్ ను బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పోలీసు కమిషనరేటు లో టాస్క్ ఫోర్స్ లో పని చేస్తూ ఇబ్రహీంపట్నం బదిలీపై వచ్చారు. ఇబ్రహీంపట్నంలో పని చేస్తున్న సీఐ ముత్యాల సత్యనారాయణ గవర్న ర్ పేట కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ను స్టేషన్ సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయ వృత్తికి, సామాజిక సేవకు వన్నెతెచ్చిన గోసు వెంకట సుబ్బారావు యాదవ్

● పదవి విరమణ చేసిన గోసు వెంకట సుబ్బారావు యాదవ్ కు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘన సత్కారం





**మార్కాపురం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక నెహ్రూ బజార్ లోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో ఉపాధ్యాయులుగా పదవి విరమణ చేసిన గోసు వెంకట సుబ్బారావు యాదవ్ కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక్ లక్ష్మి ప్రసాద్ యాదవ్ నేతృత్వంలో జరిగిన ఘన సన్మాన కార్యక్రమంలో పలు రంగాలలో ఉన్న బీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గోసు వెంకట సుబ్బారావు యాదవ్ తనకు జరిగిన ఈ ఘన సన్మానానికి బీసీ సామాజిక వర్గ మరియు యాదవ సామాజిక వర్గ బాధ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ముద్దుల వెంకట కోటయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్, మాజీ జెడ్పిటిసి, శ్రీ కాటమరాజు దేవస్థాన కమిటీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పల్లెబోయిన వెంకట్ రాజు యాదవ్,గుమ్మా గంగరాజు యాదవ్, మాజీ ఎంపీపీ ముంగమూరి పోలయ్య యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కాకర్ల శ్రీనివాస్ యాదవ్, దోర్నాల మండలాధ్యక్షుడు గుమ్మ ఎల్లేష్ యాదవ్,ఎర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, దేవుండ్ల బాలయ్య పిన్నిగా చక్రపాణి యాదవ్ పిన్నిక వెంకటేశ్వర్లు, పిన్నిక శివకుమార్ , బత్తుల పెద్ద అల్లూరయ్య, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లబోయిన వెంకటరాజు యాదవ్ మాట్లాడుతూ కాటంరాయ దేవస్థానానికి ఉద్యోగంలో ఉండి కూడా గోసు సుబ్బారావు యాదవ్ కోశాధికారిగా నియమించబడిన తర్వాత అనేక సేవా కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని కొనియాడారు. రంగస్వామి గౌడ్ మాట్లాడుతూ మార్కాపురం బీసీ భవన్ కమిటీకి నూతన అధ్యక్షుడిగా గోసు సుబ్బారావు యాదవ్ ను నియమించాలని ప్రతిపాదించారు. గుమ్మా గంగరాజు యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా అనేకమంది ప్రశంసలు పొంది పెద్దారవీడు మండలంలో పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిగల లక్ష్మీ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గోసు సుబ్బారావు యాదవ్ చేసినటువంటి సామాజిక సేవ గాని ఉపాధ్యాయునిగా ఆ రంగంలో ఎంతో సేవలు అందించిన విషయాన్ని గాని కాటమరాజు దేవస్థానానికి సంబంధించి బీసీ సామాజిక వర్గానికి సంబంధించి అందించినటువంటి సహకారం మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోసు సుబ్బారావు యాదవ్ చిన్ననాటి స్నేహితులు ఝాన్సీ పాల్ చలమయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్రయ్య, పలువురు రిటైర్డ్ ప్రిన్సిపల్స్ పల్నాటి వెంకటేశ్వర్లు యాదవ్ శివకుమార్ మరియు మంగళ గుంట గ్రామ యాదవ సోదరులు వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి యాదవ సోదరులతో పాటు చెన్నారాయన పల్లె గ్రామానికి చెందిన బుర్రి బుల్లెట్ శ్రీనివాస్ యాదవ్ బాలు యాదవ్ సుబ్బు యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమానంతరం సుబ్బారావు యాదవ్ ని ఘనంగా సన్మానించిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర్ల శ్రీనివాస్ యాదవ్, దూదేకుల మస్తానయ్య, పిన్నిక శివకుమార్ యాదవ్, వైసీపీ నాయకులు వెంకట్ రాజు యాదవ్, బుజ్జి యాదవ్ లతోపాటు అనేకమంది ఉపాధ్యాయులు సుబ్బారావు యాదవ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ కరోనా సమయం నుండి పలువురు బాధితులకు తన వంతు సహకారాన్ని అందించి ప్రాణాలు కాపాడడంలో సహకరించినటువంటి గోసు సుబ్బారావు యాదవ్ కుమార్తె ప్రసన్న యాదవులను, బీసీ సంఘాల ప్రతినిధులు గజమాలతో సాలువతో సత్కరించారు.

## రామవరపు మోడీలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



**కృత్తివెన్ను,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బంటు మిల్లి మండల పరిధిలోని రామవరపుమోడి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నందు కృష్ణా మిల్క్ యూనియన్ వారి బోనస్ పంపిణీ కార్యక్రమము ఆ సంఘ అధ్యక్షులు గూడవల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది .ఈ కార్యక్రమం లో గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ పాల్గొని 49 మంది పాల ఉత్పత్తిదారుల కు రూ. 67,924 బోనస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోట సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యం లో కృష్ణా మిల్క్ యూనియన్ మరింత అభివృద్ధి పథం లో నడుస్తుందని దానిలో భాగంగా 2024-2025 సంవత్సరానికి గాను మొదటి విడత ఏప్రియల్ నుండి జూలై వరకు 4 మాసములకు 10 శాతం బోనస్ గా గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రము పరిధిలో రూ. 54 లక్ష లను కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో 13 కోట్ల రూపాయలను పాల ఉత్పత్తి దారులకు పంపిణీ చేయడం జరుగుతుంది అని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తిదారులకు గరిష్ట ధర ధరవ్యత్యాసం బోనస్ తో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతున్నది అని పాల ఉత్పత్తిదారుల పశువులకు 20% ప్రోటీన్ కలిగిన పశుదాణా ను తక్కువ ధరకు, మార్కెట్ కంటే తక్కువ ధరకు మంచి పోషక విలువలు కలిగిన కాల్షియం, మినరల్ మిక్చర్ గోల్డ్ లను అందించడం జరుగుతుంది అని పశువుల పాల దిగుబడి పెంపొందించాలి అనే లక్ష్యం తో మంచి మేలు జాతి ముర్రా వీర్యం (సేమన్)ను పాల ఉత్పత్తిదారుల పశువులకు అందించుట ఉచితంగా నట్టలనివారణ డివార్మింగ్ మందులను అత్యవసర సంచార పశు వైద్య సేవలు అందించడంతోపాటు క్షీర బంధు కళ్యాణమస్తు ప్రతిభ వంటి పథకాలతో పాల ఉత్పత్తిదారుల కు అండగా నిలుస్తున్నది అని తెలిపారు. బోనస్ పంపిణీ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కు పాడి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ చొప్పకట్ల వరప్రసాద్ వేతన కార్యదర్శి గూడవల్లి ఆదిశేషు టెస్టర్ రామలక్ష్మి మరియు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు..

## వైసీపీ నుంచి టిడిపిలోకి ఇద్దరు కౌన్సిలర్లు

● మూడుకు పెరిగిన టిడిపి బలం



**పెడన,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** వైసీపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు బుధవారం నాడు టిడిపిలో చేరారు. దీంతో టిడిపి బలం కౌన్సిల్లో ముగ్గురుకి పెరగగా కూటమి బలం నలుగురు అయ్యారు. జనసేన పార్టీకి ఇక్కడ ఒక కౌన్సిలర్ ఉన్నారు.రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ విధానాలు పట్ల ఆకర్షితులై టీడీపీ లో భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నామని పార్టీ మారిన కౌన్సిలర్లు చెప్పారు. 1వ వార్డు కౌన్సిలర్ బళ్ల పద్మావతి 20వ వార్డు కౌన్సిలర్ కోసనం కరుణ కుమారి కొసనం సత్యనారాయణ బళ్ల సూర్యచంద్ర రావులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ టిడిపిలోకి వీరిని ఆహ్వానించారు. స్థానిక పోలవరపు పేటలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు పార్టీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సమక్షంలో పై ఇరువురు కౌన్సిలర్లు తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలుపార్టీ లో చేరారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరిన వారిని స్వాగతిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూటమి అభివృద్ధి బాటలో పాలు పంచుకుని ప్రజా సంక్షేమం ధ్యేయంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం( హన్ను ) పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య ప్రధాన కార్యదర్శి వాహబ్ ఖాన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివంగత పండగల శ్రీనివాస రావుకు ఎమ్మెల్యే ఘన నివాళి



**వీరులపాడు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండలం జయంతి గ్రామం, పడగల శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల అర్పించారు శ్రీనివాసరావు కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని చెప్పారు ఈ కార్యక్రమంలో గువ్వల సత్యనారాయణ, చెదిరాల భరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా కొండేపూడి సత్యనారాయణ



**అమలాపురం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** డాక్టర్.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొండేపూడి సత్యనారాయణ ఎన్నికయ్యారు.అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కొండేపూడి సత్యనారాయణ. గౌరవ అధ్యక్షులుగా చొల్లంగి అప్పాజీ కార్యదర్శుగా దొమ్మేటి వెంకట్,కోశాధికారిగా గారపాటి పండు బాబు,ఆర్గనైజింగ్ సెక్రటరీ కదలి సూరిబాబు,ఉపాధ్యక్షులుగా కానుబోయిన దుర్గాప్రసాద్,పొలమూరి సురేష్,సంయుక్త కార్యదర్శిగా కుడుపూడి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులుగా పెయ్యల వెంకటేశ్వరరావు, గుత్తుల మూర్తి,మోతా వెంకటేశ్వరరావు,ఊటాల చిరంజీవి,దడాల త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రంబాల సత్యనారాయణ,ముక్కామల చక్రధర్ ,వట్టికూటి గోవింద్,రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

## 9 న , మేరు సంఘం జిల్లా కమిటీ, మండల కమిటీల సమావేశం



**భద్రాది కొత్తగూడెం, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మేరు సంఘం జిల్లా కమిటీ, మండల కమిటీల సమావేశం ఈనెల ది. 09-08-2024 శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు పాల్వంచ దమ్మపేట సెంటర్లో రాజ మనోహర్ నిర్వహించబడునని భద్రాది కొత్తగూడెం జిల్లా మేరు సంఘం అధ్యక్షులు తాళ్ల రవికుమార్,ప్రధాన కార్యదర్శి అడపా నవీన్ ఒక ప్రకటనలో వారు తెలిపారు. ఈ సమావేశ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు మండల అధ్యక్ష, కార్యదర్శులు కోశాధికారులు అందరూ హాజరు కాగలరని తెలిపారు. ఏజెండా రాష్ట్రమేరు సంఘం ఎన్నికలు 18-8-2024 ఆదివారం జరుగుతాయని మండలాల నుండి జన సమీకరణ, రాష్ట్ర నాయకుల పర్యటన పై చర్చించుతామని జిల్లా మండల సభ్యులు సకాలంలో అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## మడక పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



**పెడన,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని మడక పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నందు కృష్ణా మిల్క్ యూనియన్ వారి బోనస్ పంపిణీ కార్యక్రమము బుధవారం నాడు జరిగింది. సంఘ అధ్యక్షులు జోగి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ పాల్గొని పాల ఉత్పత్తిదారుల కు రూ. 91,940బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యం లో కృష్ణా మిల్క్ యూనియన్ మరింత అభివృద్ధి పథం లో నడుస్తుందని దానిలో భాగంగా 2024-2025 సంవత్సరానికి గాను మొదటి విడత ఏప్రియల్ నుండి జూలై వరకు నాలుగు మాసములకు 10శాతం బోనస్ గా గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రము పరిధిలో రూ. 54 లక్ష లను విడుదల చేశారన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో 13 కోట్ల రూపాయలను పాల ఉత్పత్తి దారులకు పంపిణీ చేయడం జరుగుతుంది అని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తిదారులకు గరిష్ట ధర ధరవ్యత్యాసం బోనస్ తో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతున్నది అని చెప్పారు.పాల ఉత్పత్తిదారుల పశువులకు 20 శాతం ప్రోటీన్ కలిగిన పశుదాణా ను తక్కువ ధరకు మార్కెట్ కంటే తక్కువ ధరకు మంచి పోషక విలువలు కలిగిన కాల్షియం మినరల్ మిక్చర్ గోల్డ్ లను అందించడం జరుగుతుంది అనివివరించారు.పశువుల పాల దిగుబడి పెంపొందించాలి అనే లక్ష్యం తో మంచి మేలు జాతి ముర్రా వీర్యం (సేమన్)ను పాల ఉత్పత్తిదారుల పశువులకు అందించుట ఉచితంగా నట్టలనివారణ డివార్మింగ్ మందులను అత్యవసర సంచార పశు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.క్షీర బంధు కళ్యాణమస్తు ప్రతిభ వంటి పథకాలతో పాల ఉత్పత్తిదారుల కు యూనియన్ అండగా నిలుస్తున్నది అని తెలిపారు. బోనస్ పంపిణీ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కు పాడి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బసవరాజు వేతన కార్యదర్శి వెంకటరావు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు..

## బోడెమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీపీ దంపతులు



**విస్సన్నపేట,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో చంద్రుపట్ల గ్రామానికి చెందిన వైసిపి కుటుంబ సభ్యురాలు బాణావతు బోడెమ్మ మృతి చెందడంతో ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్ దంపతులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాత కుంట్ల ఎంపిటిసి మేడా తిరుపతిరావు తాతకుంట్ల వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు కలిషా, గిరిజన నాయకులు జీత్య తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా పరుశురాములు



**అడ్డగూడూర్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీ ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మేడి పాపన్న మాట్లాడుతూ అడ్డగూడూర్ మండల కేంద్రానికి చెందిన బాలెంల పరశురాములు ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమైన నుండి ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో వివిధ హోదాలో పనిచేస్తూ ఉద్యమానికి ఊపిరి పోస్తు ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ముందుకు తీసుకపోవడంలో పరుశురాములు కీలక భూమిక పోషించేవారని పట్టుదలతో పనిచేసేవారు. అతనికి ఏ పని చెప్పినా బాధ్యతగా పనిచేసేవారని అన్నారు. రాష్ట్ర నాయకత్వం గుర్తించి మేడి పాపయ్య ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన బాలెం ల పరుశురాములను గుర్తించి ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియామక పత్రం అందజేయడం జరిగిందన్నారు . కార్యక్రమంలో కూరెళ్ళ రమేష్ మాదిగ, కాశ గళ్ళ రమేష్ మాదిగ, బోట్ల శీను మాదిగ, శంకర్ మాదిగ, బుషి మహేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సెవెంత్ డే అడ్వెంటిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో సన్మాన సభ కార్యక్రమం.



**వీరుల పాడు, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** వీరులపాడు మండలం జయంతి గ్రామంలోఅడ్వెంటిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య కు సన్మాన సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా తంగిరాల సౌమ్య పాల్గొని మాట్లాడుతూ చర్చ్ నిర్మాణానికి నా వంతు సహాయం అందజేస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే త్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థికి పాముల సరితకు తంగిరాల సౌమ్య పదివేల రూపాయలు బహుమతిగా ప్రధానం చేయడం జరిగింది. అలాగే నూతన వధూవరుల్ని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గువ్వల సత్యనారాయణ చీదిరాల భరత్ రెడ్డి తెలుగు యువత టీం యేసు రత్నం సంగయ్య మోషే కొండలు సుధాకర్ రమేష్ తెదేపా నాయకులు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైద్యం కోసం బాలింతలు,చిన్నారులకు వరద కష్టాలు

● చినుకు పడితే చాలు...ఆసుపత్రి జలదిగ్బందమే

● బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్



**భద్రాద్రి కొత్తగూడెం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కొత్తగూడెంలి: చినుకు పడితే చాలు... ఆసుపత్రి జలదిగ్బందమే మంగళవారం ఉదయం నుండి కురుస్తున్న వర్షాలకు రామవరంలోని మాతాశిశు కేంద్రానికి రహదారి లేకుండా బాలింతలు,చిన్నారులు వైద్యం కోసం ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ అన్నారు.వరదల వల్ల బాలింతలు,చిన్నారులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని ఆయన ఆసుపత్రి వద్దకు బుధవారం చేరుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో ఉన్న ఏకైక మాతాశిశు కేంద్రానికి రోజు సుమారు రెండు వందల మంది వైద్య సేవల కోసం వస్తుంటారని,అదేవిధంగా జిల్లాలో ఏకైక ఆసుపత్రి కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి గర్భిణీలు ఇక్కడకి వచ్చి డెలివరీలు చేపించుకుంటారని తెలిపారు.బుధవారం ఉదయం నుండి కురుస్తున్న వర్షాలకు ఆసుపత్రిలో ఉన్న రోగులు బయటకు వెళ్ళడానికి,బయట నుండి రోగులు లోపలకు రావడానికి రహదారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.వంతెన మీదకు మోకాళ్ళ లోతు నీళ్ళు చేరడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు.కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రి చిన్నపాటి వర్షానికే రహదారి లేకుండా వుండటం అంటే పాలకులకు,అధికారులకు పేద ప్రజల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతోందన్నారు.తక్షణమే ప్రభుత్వం,జిల్లా అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జమల్ పాషా,మురళి,సయ్యద్ పాషా,భాస్కర్లి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత అవసరం!!

● ఫిర్యాదుల కోసం 1930 నెంబరులో సంప్రదించండి

● వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ తెలుపవద్దు

● జె.కృష్ణమూర్తి, రామగుండం సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిఐ



**పెద్దపల్లి/ గోదావరిఖని,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత ప్రతి ఒక్కరికి అవసరం అని తెలిపారు రామగుండం సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిఐ జె.కృష్ణమూర్తి. ఈ మేరకు బుధవారం సింగరేణి ఆర్జీవన్ జీఎం కార్యాలయంలో ఎస్ అండ్ పిసి సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలను తెలియజేశారు సీఐ. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు ఎవరికి తెలుపవద్దు అని అన్నారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెప్తూ బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని , ఇతరత్రా ఆశచూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎర వేస్తారని, అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించరాదని సీఐ తెలిపారు. సదస్సులో సైబర్ సెక్యూరిటీ సిబ్బంది వెంకటేష్, శ్రీనివాస్, శ్రీధర్, సింగరేణి అధికారులు వీరారెడ్డి, ఉమేష్, అక్బర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో వెనుకబడ్డ కొండపల్లి మున్సిపాలిటీ

● ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్



**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కొండపల్లి మునిసిపాలిటీ ఎన్నికలు జరిగి 30 నెలలు గడిచిన పాలకవర్గం లేని అనాథగా కొండపల్లి మున్సిపాలిటీ మిగిలిందని అన్నారు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోర్ర కిరణ్. బుధవారం నాడు ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొండపల్లి మునిసిపాలిటీ ఎన్నికలలో ఆనాటి వైసీపీ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన తీర్పు ను గౌరవించకుండా పాలవర్గంను ఏర్పాటు కాకుండా,మునిసిపాలిటీ అభివృద్ధిని అడ్డుకోవటం దురదృష్టకరం అని తెలిపారు. నాడు పంచాయతీలుగా ఉన్న ఇబ్రహీంపట్నం మరియు కొండపల్లి గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు విలవిల ఆడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు దృష్టిపెట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పాలకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అభివృద్ధి లో వెనుకపడుతున్న మునిసిపాలిటీ పై తగు చర్యలు తీసుకోవాలని కిరణ్ కోరారు.ఈ సమావేశం లో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్,చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, అక్కల నాగేంద్ర ప్రసాద్,రాగాల రాము, చెరుకు ఆనందరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# యలమంచి ఉదయ్ కిరణ్ యువసేన ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



**శేరిలింగంపల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మియపూర్ డివిజన్ పరిధిలోని మియపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో యలమంచి ఉదయ్ కిరణ్ యువసేన ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని నిర్వహకులను అభినందించారు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,కాంటెస్టెడ ఎమ్మెల్యే వి.జగదీశ్వర్ గౌడ్ మరియు కూకట్పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్.ఈ సందర్భంగా విద్యార్థులను ఉదేశించి వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని,విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రంగాలలో రన్నించేలా కృషి చేస్తుందని అన్నారు,దేశానికి వన్నెతెచ్చేలా విద్యార్థులను తీర్చిదిదలని ఉపాధ్యాయులను కోరారు,అనంతరం ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణను అభినందించారు.ఈ కార్యక్రమంలో జి.హెచ్.ఎం.సి లేబర్ సెల్ చైర్మన్ నల్ల సంజీవ రెడ్డి,వీరేందర్ గౌడ్,మన్నెపల్లి సాంబశివరావు,కృష్ణ గౌడ్,తిరుపతి,తాండ్ర రామచందర్,శ్రీకాంత్, రవి కుమార్,రవిపాటి వెంకటేశ్వరలు,ఆలపాటి శివాజీ రావు, రవి, సత్యం, శరత్, వినయ్, వంశీ, ప్రవీణ్, శేఖర్, సాయి, వాసు, వినోద్, నాని, చిరంజీవి, బాబ్జి, శ్రీనివాస్, విజయ్, సుదర్శన్, సత్యనారాయణ, ప్రసాద్, అనిల్, లోకేష్, పద్మిని, రాంబాబు, సురేష్, నవీన్,శ్రీకాంత్,గణేష్,రాజశేఖర్,బాబు,భాస్కర్,ముఖేష్,ప్రధన ఉపాధ్యాయురాలు శ్రీమతి. వసుందర,యూసుఫ్,మోహన్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు బట్టలు పంపిణీ

● ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పుట్టినరోజు సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లకుండా దివ్యాంగుల మధ్య జరుపుకుని వాళ్లకు బట్టలు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు తెదేపా నాయకులు దంపతులు. కొండపల్లి మున్సిపాలిటీ 24 వార్డు కౌన్సిలర్ పులి అరుణకుమారి మరియు పులి దాసు ల కుమార్తెలు రాజీవని రసజ్ఞ, మృదుల సంజనల జన్మదినం బుధవారం సహాయ మాత పాఠశాలలలో దివ్యాంగుల మధ్య జరుపుకుని వారికి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఆయన చేతుల మీద బట్టల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేకులను కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమాజానికి బిత్తిరి సత్తి క్షమాపణలు చెప్పాలి

● శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ డిమాండ్



**కుత్బుల్లాపూర్,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** యావత్ హిందూ ప్రజానీకం ఎంతో పరమ పవిత్రంగా భావించే భగవద్గీత శ్లోకాలను బిత్తిరి సత్తి అలియాస్ రవికుమార్ బిల్ల గీత పేరుతో సోషల్ మీడియా వేదికగా ఆలపించిన శ్లోకాలు భగవద్గీత శ్లోకాలను కించపరిచేలా ఉన్నాయని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో సనాతన ధర్మమన్నా... హిందూ సంస్కృతి సాంప్రదాయాలన్నా ప్రతి ఒక్కరికి చులకనగా మారిపోయాయని, హిందూమతాన్ని, సనాతన ధర్మాన్ని అవహేళపరిచినా హిందువులు పెద్దగా పట్టించుకోరని ఎవరికి వారు ఇష్టం వచ్చినట్టుగా సనాతన ధర్మాన్ని, మన పండుగలు, దేవుళ్ళను, మన పవిత్ర గ్రంథాలను, అందులో శ్లోకాలను ఇష్టం వచ్చిన రీతిలో అవమానపరుస్తూ అవహేళన పరుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఇటీవల అనగా మంగళవారం సోషల్ మీడియా వేదికగా బిత్తిరి సత్తి బిల్ల గీత పేరుతో ఆలపించిన శ్లోకాలు భగవద్గీత శ్లోకాలను కించపరిచే విధంగా ఉన్నాయని, ఇవి ఎందరో హిందువుల మనోభావాలను దెబ్బతీసిన విధంగా ఉన్నందున బిత్తిరి సత్తి యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన పత్రిక ముఖంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిత్తిరి సత్తి హిందువుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# చిరివెళ్లపాలెంలో గర్భిణీలకు శ్రీమంతాలు



**పెడన,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** సమగ్ర శిశువు అభివృద్ధి పథకం( ఐసిడిఎస్) బందరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరిగిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు తాళ్లపాలెం సెక్టార్ పరిధిలోని చిరివెళ్లపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతాలను నిర్వహించారు. వారికి పసుపు కుంకుమలను అందజేశారు. సూపర్వైజర్ ఎ లక్ష్మి మాట్లాడుతూ గర్భవతులు ప్రసవాల తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ముఖ్యంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. తల్లిపాలు పసిపిల్లలకు అమృతంతో సమానమని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాసరావు ఏఎన్ఎం అనిత ఆశా వర్కర్ కల్పన అంగన్వాడీ కార్యకర్త లూధియా తదితరులు పాల్గొన్నారు.



పల్లంపల్లి కూడలి, దాములూరు రాకపోకలను నిలిపివేసి, వైరా కట్టలేరు పరిశీలిస్తున్న తాసిల్దార్ రాజా కిషోర్ మరియు రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాబు వీఆర్వో సయ్యద్ గౌస్ రెవిన్యూ సిబ్బంది
-వీరులపాడు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :



కొత్తగా బాధ్యతలు చేపట్టిన జి.కొండూరు మండలం తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించిన జి.కొండూరు మండల వ్యవసాయం అధికారి యమ్. రామ్ కుమార్ మరియు కార్యాలయం సిబ్బంది.
-జి.కొండూరు,ఆగష్టు 7 (వార్తాప్రభ) :

# వరద హెచ్చరిక కారణంగా సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండాలి

● రోడ్డుమీద వర్షపు నీటి నిల్వలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలి

● విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బెంజ్ సర్కిల్ వద్ద వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం పర్యటించి పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగ కుండా ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని. రోడ్డుపైన వర్షపు నీటి నిలువలను లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ ప్రజలకు, ట్రాఫిక్ ఎటువంటి అంతరాయం కలగకుండా, సిబ్బంది నిరంతరం ఫీల్డ్ లో ఉంటూ చూసుకోవాలి అని అన్నారు. బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ కింద జరుగుతున్న గ్రీన్ బెల్ట్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా పూర్ణానంద పేట, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిశీలించారు. పూర్ణానంద పేట ప్రాంతంలో పర్యటించి పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా జరగకపోవడం గమనించి పారిశుద్ధ కార్మికులు పరిస్థితి నిర్వాహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా పారిశుద్ధం పక్కగా నిర్వహించాలని నగరాన్ని అందంగా, ప్రజలను ఆరోగ్యంగా ఉంచేందుకు పారిశుద్ధ నిర్వహణ ఖచ్చితంగా జరగాలని అన్నారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నందు ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు జరుగుతున్న పనులను పరిశీలించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతోపాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏ ఎస్ ఎన్ ప్రసాద్, వి శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ రామ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**వలిగొండ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకల ను పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నటువంటి నేత కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పద్మశాలి నాయకులు మాట్లాడుతూ..వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద రంగమైన చేనేత అనే రంగం ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని,అత్యంత దుర్భరమైన జీవితం గడుపుతున్న నేత కార్మికులు జీవనం కొనసాగించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల మగ్గం అనే ఒక ఆదాయంపై మాత్రమే ఆధారపడతారని ఇతర ఇటువంటి ఆదాయాలు చేనేత కార్మికులకు ఉండవని తద్వారా చేనేత కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వలిగొండ పద్మశాలి సంగం అధ్యక్షులు ఐటిపాముల రవీంద్ర గ్రామ పెద్దలు తవుతాం నరహరి,దొంత శంకరయ్య,సాయిని యాదగిరి,ఐటిపాముల కుమార్,గారదాసు నర్సింహ,ఐటిపాముల ప్రభాకర్,రాపోలు శ్రీనివాస్,మిర్యాల శ్రీనివాస్,బాలనర్సింహ, రమేష్, శ్రీనివాస్, లెనిన్,జగన్ తదితరులు పాల్గొన్నారు.

# బిపి మండల్ బీసీల ఆరాధ్య దైవం

● బీసీ ఐక్యవేదిక నేత భేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్, ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ యాదవ్ బిపి మండల్ బీసీల ఆరాధ్య దైవం బీసీ నాయకులు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరు జరుపుకోవాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 46 సంవత్సరాల వరకు కేంద్ర సర్వీసులలో ఓ.బి.సి రిజర్వేషన్లు అమలు కాలేదని అన్నారు. కేంద్రీయ విద్యాసంస్థలలో ఓ.బి.సి రిజర్వేషన్లను సాక్షాత్తు ఆయా ప్రభుత్వాలే అడ్డుకున్నాయని తెలిపారు. మొదటిసారిగా మండల్ కమీషన్ సిఫార్సులలో భాగంగా ఓ.బి.సి లకు రిజర్వేషన్లు అమలు కోసం 1990వ సంవత్సరం ఆగస్ట్ 7వ తేదీన అప్పటి ప్రధాని వి.పి.సింగ్ ప్రభుత్వం పార్లమెంట్ లో ఒక ప్రకటన చేసిందని గుర్తు చేశారు. ఆరోజు ఓబిసి లకు ఒక చారిత్రాత్మక రోజని, రిజర్వేషన్లు అమలైన రోజని అటువంటి రోజును "మండల్ దే "గా గుర్తిస్తూ మహానీయుడు బి.పి.మండల్ కు ఘనంగా నివాళులు అర్పిద్దామన్నారు. బి.పి.మండల్ కమీషన్ ఇచ్చిన నివేదికను (40 సిఫార్సులను) పూర్తిగా అమలు చేయాలని, క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల్ ఆశయాలను సాధించుటకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆగస్ట్ 7న అదే మహానీయుడికి మనం ఇచ్చే నిజమైన నివాళని చెప్పారు కార్యక్రమంలో కే నరసింహ యాదవ్, వడ్డే త్యాగరాజ్, మరియు బీసీ సంఘాల నాయకులు పాల్గొని తెలియజేశారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● సీఆర్డీఏ కమిషనర్ ను మర్యాదపురం కలిసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



**విజయవాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.పుష్పగుచ్ఛాలు అందజేసి,శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గంలోని పలు విషయాలపై చర్చించారు. మైలవరం నియోజవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యుత్ దీపాలు పునరుద్ధించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య,ఇతర నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# గోతులు పూడ్చండి మహాప్రభో



**విస్సన్నపేట,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** తిరువూరు మైలవరం నియోజకవర్గాల ముఖద్వారాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఆర్ అండ్ బి రోడ్లు గోతులు పూడ్చివేయాలని సర్వత్రా కోరుతున్నారు. మైలవరం నియోజకవర్గ బోర్డర్ మరోవైపు తిరువూరు నియోజకవర్గ బోర్డర్ విసన్నపేట మండలం ముఖ ద్వారం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలియజేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన రహదారులపై ఉన్న భారీ గోతులకు రిపేర్లు చేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

# ప్రజల్లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం పై అవగాహన కల్పించిన జిహెచ్ఎంసి....



**శేరిలింగంపల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బీ బ్లాకులో,స్వయం సహాయక సంఘాలతో కలసి,దోమలు నిర్మూలన,దోమలు వల్ల కలిగే వ్యాధులు గూర్చి,తడి, పొడి చెత్త గూర్చి చేపడుతున్న చర్యలు,ప్రజలు చేపట్టాల్సిన జాగ్రత్తలు గూర్చి,స్థానిక ప్రజలతో కలసి అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది.స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని,అధికారులకు సహాయ సహకారాలు అందించి,కార్యక్రమ స్ఫూర్తిని విజయవంతం చెయ్యాలని విచ్చేసిన జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక ప్రజలను కోరారు.ఈ స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో పిఓ నాగ మల్లేశ్వరి,సీఓ పద్మ, రమా, ఆర్పీ రూప రెడ్డి,కళ్యాణి, శానిటేషన్ ఇంచార్జి రాజయ్య, ఏంటోమాలజీ సూపెర్వైజర్ అబ్దుల్ సత్తార్,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గుడివాడ ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● ఆటోనగర్ సమస్యలపై ఎమ్మెల్యే రాముకు వినతి పత్రం అందజేసిన కార్మికులు..



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా గుడివాడ ఆటోనగర్ లో సంవత్సరాల తరబడి నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా వేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు, కార్మికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనేక ఏళ్లుగా ఆటోనగర్ లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కార్మికులు ఎమ్మెల్యే రాముకు తెలియజేశారు. కార్మికుల సమస్యలను సావదానంగా విన్న ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తనను కలిసిన వారికి భరోసా ఇచ్చారు. గత వైకాపా ప్రభుత్వంలో అన్ని రంగాలతో పాటుగా చిన్న తరహా పరిశ్రమలు కూడా తీవ్రంగా నష్టపోయాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అన్నారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమను ప్రోత్సహించేలా గతంలో ఉన్న రాయితీలను వైకాపా ప్రభుత్వం తీసివేసిందని.. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక రంగ అభివృద్ధిలో భాగంగా రాయితీలను తిరిగి ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే రాము తెలియచేశారు. సమస్యలపై స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే రాముకు.. కార్మికులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, యూనియన్ నాయకులు హమీద్, నాగరాజు, భాషా, ఆటోనగర్లోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాన్ని సందర్శించిన.. -11వ అదనపు జిల్లా జడ్జ్ సుబ్రహ్మణ్యం



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ వారీ ఉత్తర్వుల ప్రకారం మండల న్యాయ సేవాధికారిక కమిటీ, గుడివాడ చైర్మన్ మరియు పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి. శ్రీ జి. సుబ్రహ్మణ్యం గారు మానసిక వికలాంగుల స్కూలు ఐన."భవిత" సెంటరును సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు అందుతున్న వసతులు, వారి విద్యా విధానం, నైపుణ్యతను తెలుసుకోవడం జరిగింది. ఈ క్రమంలో మానసిక వికలాంగుల పిల్లల తల్లిదండ్రుల వారీ పట్ల ఎంతో ఓర్పుతో ఉండాలని వారినీ మాములు పిల్లల లాగ.. తీర్చిదిద్దడానికి మరింత కృషీ చేయాలనీ సుబ్రహ్మణ్యం గారు తెలిపారు. పిల్లలకు సంస్థ తరపున ఫిజియోథెరపీ కూడ చేయించినారు. ఈ కార్యక్రమంలో బార్ అసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజయ్‌బాబు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఎల్‌సి ఆఫ్ గుడివాడ ప్రగతి అధ్యక్షుడు ఎం. వీరశేఖర్, సెక్రటరీ అన్నే నవీన్, కోశాధికారి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ విజయభాస్కర్ రావు.. అలాగే పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రెస్టారెంట్లు.. ఫుడ్ కోర్టులలో ఆకస్మిక తనిఖీలు



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** పట్టణంలోని పలు హోటల్లలో నిబంధనలు పాటించకపోవడం.. అలాగే అశుభ్ర వాతావరణాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. బుధవారం ఏలూరు రోడ్డులోని ఫ్రైడ్ వింగ్స్ ఫుడ్ కోర్ట్ ను అధికారులు సీజ్ చేసారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహినుద్దీన్ మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని హోటల్లలో కాలపరిమితి తీరిన ముడి పదార్థాలు.. ఫంగస్ పట్టిన బ్రెడ్లు, హానికర కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలియజేశారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించని హోటళ్లపై సెక్షన్ 61 ప్రకారం జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారులు దృష్టిలో పెట్టుకోవాలని హెచ్చరించారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరునక్షత్ర వేడుక..



**గుడివాడ,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** స్థానిక జగన్నాధపురంలో వేంచేసియున్న శ్రీ భూ నీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర పర్వదిన వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా తెల్లవారుజాము నుండి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా దేవస్థాన ధర్మకర్తల కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణరావు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ ఏడాదితో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమై 50 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా.. అర్థ శతాబ్ద వార్షిక ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని.. యావన్మంది భక్తులు ధనుర్మాస ఉత్సవాలు శోభాయమానంగా జరిగేలా సూచనలు సలహాలు ఇవ్వాలని దేవస్థానం ఈ.వో షణ్ముగ నటరాజన్ కోరారు. ఈ వేడుకల్లో వేద పండితులు వేదాంతం అప్పలాచారి, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

● శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**శేరిలింగంపల్లి,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామం గల శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో బుధవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.ఆలయాలు మానసిక ప్రశాంతతకు ఎంతగానో దోహదపడతాయని,గచ్చిబౌలి డివిజన్ లో ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ చేస్తానని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజు, సత్య, రంగస్వామి,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి.. ఒక్కరికి తీవ్ర గాయాలు



**నర్సాపురం,ఆగష్టు 7 (వార్తాప్రభ) :** నరసాపురం మొగల్తూరు రోడ్ ఆంజనేయ స్వామి గుడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సీతారాంపురం వైపు నుండి నరసాపురం వస్తున్న స్కార్పియో ఏపి 40ఏపి 3344 వాహనం మోటార్ సైకిల్ ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. నరసాపురం మండలం మంగలగొట్టుపాలెం గ్రామానికి చెందిన మేకా మేరీ భాయి (50) అక్కడికక్కడే మృతిచెందగా గోరింకల ఆలిహర్ (32) తీవ్ర గాయాలయ్యాయి ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మృతి చెందిన మేరీ భాయ్ కుటుంబ సభ్యుల సానుభూతిని తెలిపారు.గాయపడిన వారికీ వైద్య సహాయం నిమిత్తం వెంటనే చర్యలు చేపట్టారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188